
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



టీడీపీ జిల్లా రథసారథి ఎవరో..?



- నేడు కమిటీ రాక... అభిప్రాయ సేకరణ
- ఆశావహ రేసులో అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, భూపేశ్‌రెడ్డి, ఎమ్మెల్యే చైతన్యరెడ్డి, ఎస్.గోవర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్

కడప, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కడప పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడి కోసం టీడీపీ వేట మొదలు పెట్టింది. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటింది. ఈ నేపథ్యంలో పార్టీ పటిష్టతపై దృష్టి సారించింది. సీనియర్లు, యువత కాంబినేషన్‌లో పార్టీకి బలమైన నాయకత్వాన్ని అందించేందుకు అడుగులు వేస్తోంది. ఈ సారి మోహ మాటాలకు, సిఫారస్సులకు తావులేకుండా కరుడుకట్టిన కార్యకర్తలనే కమిటీలో నియమి స్తామని సీఎం చంద్రబాబునాయుడు ప్రకటించారు. ఈ నేపధ్యంలో టీడీపీ సీనియర్ నాయకుడు బీద రవిచంద్ర, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి, బ్రహ్మం చౌదరిలను కడప పార్లమెంటుకు కమిటీ సభ్యులుగా నియమించింది. సోమవారం కడప హరిత హోటల్‌లో కార్యవర్గం సమావేశమై అభిప్రాయాలను సేకరించనున్నారు. ఈనెల చివరిలోపు పార్లమెంటు కమిటీలను పూర్తి చేయాలని చంద్రబాబు నిర్ణయించారు. పార్లమెంటు అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులను చంద్రబాబునాయుడే ప్రకటిస్తారు. కమిటీ ఆశావహుల నుంచి అభిప్రాయాలను సేకరిస్తుంది.

అధ్యక్షుడి రేసులో ఆశావహులు

టీడీపీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల పదవులను పలువురు ఆశిస్తున్నారు. టీడీపీ అధికారంలో ఉండటంతో అధ్యక్ష పదవి అంటే ఇంచుమించు మంత్రితో పవర్ ఉంటుంది. దీంతో ఎమ్మెల్యే టికెట్ ఆశించి బంగపడ్డ కొందరు నేతలు, కార్పొరేషన్ పదవులు ఆశించిన వారు ఈ పార్టీ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. కాగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పాటు 32 మందికి పైగా కార్యవర్గాన్ని ప్రకటించనున్నారు. మరి ఎంతమంది ఆశావ హులు ముందుకొస్తారో వేచి చూడాలి. సీనియర్ నాయకులుగా చెలామణి అవుతున్న వారు కూడా గంపెడు ఆశలు పెట్టుకున్నారు. ముఖ్యంగా జిల్లా పదవుల కోసం వారు వేయికళ్లతో ఎదురు చూస్తున్నారు. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నియ మించిన కమిటీ ఇచ్చే నివేదికపై జిల్లా అంతటా ఉత్కంఠ నెలకొంది.



- ప్రస్తుత అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి మరో సారి అధ్యక్షుడిగా కొనసాగేందుకు ఆశలు పెట్టుకున్నారు. ఈయన ఉమ్మడి జిల్లా అధ్యక్షు డిగా ఒకసారి, కడప జిల్లా అధ్యక్షుడిగా రెండుసార్లు పనిచేశారు. ప్రస్తుతం పొలిట్ బ్యూరో సభ్యుడిగా కూడా ఉన్నారు. సీఎం చంద్రబాబుకు సన్నిహితుడిగా పేరు తెచ్చుకు న్నారు. దీంతో మరోసారి అధ్యక్ష పదవి తననే వరిస్తుందని ఆశపెట్టుకున్నారు.



- ఇక పార్టీ పదవుల్లో యువతకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పడంతో యువ నాయకుల పేర్లు తెరపైకి వచ్చాయి. జమ్మలమడుగు అసెంబ్లీ ఇన్‌చార్జి చదిపిరాళ్ల భూపేశ్‌రెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ తరుపున భారీగా ఫైట్ ఇచ్చారు. అవినాశ్‌రెడ్డి గెలుపు భూపేశ్ చేతిలో చావుతప్పి కన్నులొట్టపోయినట్లు గెలిచారు.



- గతంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన హరిప్రసాద్ కూడా అధ్యక్ష రేసు లో ఉన్నారు. జిల్లాలో బలిజ సామాజిక వర్గంలో కీలక నేతగా ఉన్నారు. వైసీపీ హయాం లో కూడా కడప జిల్లాలో జరిగిన అక్రమాలపై దూకుడుగా మాట్లాడారు. అయితే ఇటీవల కొన్ని పరిణామాలు బలిజల అసంతృప్తికి దారితీస్తున్నాయి. ఈనేపధ్యంలో అధ్యక్ష పదవి కోసం ఆయన ఆశలు పెట్టుకున్నారు.



- కడపకు చెందిన గోవర్ధన్‌రెడ్డి పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేస్తున్నారు. కడప ఎమ్మెల్యే టికెట్‌ను కూడా ఆశించి భంగపడ్డారు. టీడీపీకి ఎంతో నమ్మకస్తుడిగా, నిబద్ధతో ఉన్నాడు. ఇంట్లో శుభకార్యాల్లో కూడా దివంగత ఎన్టీఆర్ ఫొటోను ఉంచుకుని కార్యక్రమాలు నిర్వహి స్తున్నాడంటే ఆయనకు పార్టీపై ఉన్న నిబద్ధత ఏపాటిదో అందరికీ అర్థమౌతోంది. ఈసారి ఆయన కూడా ఆశపెట్టుకున్నారు.



- యూత్ బ్యాచ్‌లో కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తోంది. మహానాడును భారీ విజయవంతం చేయడంలో ఆయన తన తండ్రితో కలిసి అందరిని కలుపుకుపోయి సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌తో మంచి మార్కులు సంపాదించాడు. దీంతో ఆయన కూడా గట్టిపోటీ ఇస్తున్నారు. భూపేశ్, చైత న్యలు మంత్రి నారా లోకేశ్ టీంగా పేరుంది. ఈ నేపధ్యంలో యూత్ క్యాటగిరిలో ఎమ్మెల్యే చైతన్య, భూపేశ్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి.

డిగ్రీ కళాశాల భవనాల పరిశీలన

పెండ్లిమర్రి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సమీపంలో ఉన్న డిగ్రీ కళాశాల భవనాలను ఆదివారం కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎస్పీ అశోక్‌కుమార్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు కళాశాల ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సెప్టెంబరు 2వ తేదీ నూతన కళాశాల భవనాలను ప్రారంభించేందుకు వస్తు న్నారని.. ఏవైనా పనులు ఉంటే వెంటనే పూర్తి చేయాలన్నారు. తరగతి గదులను, కళా శాల ఆవరణను, ల్యాబ్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీఓ జాన్ ఇర్విన్, తహశీ ల్దార్ అనురాధ, మండల టీడీపీ అధ్యక్షుడు గంగిరెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

కడప కలెక్టరేట్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సభాభవనంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరుగుతుందని జిల్లా రెవె న్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9-30 గంటల నుంచి డయిల్ యువర్ కలెక్టర్, 10గంటల నుంచి స్పందన కార్యక్రమం ఉంటుం దని.. అర్జీదారులు తమ సమస్యలు తెలిపి పరిష్కారం పొందాలని ఆయన కోరారు.

హోటళ్లు, రెస్టారెంట్లలో నాణ్యత పాటించాలి


- ఫుడ్ సేఫ్టీ అధికారి హరిత



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న ఫుడ్‌సేఫ్టీ అధికారి హరిత

కడప కలెక్టరేట్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): హోటళ్లు, రెస్టారెంట్లలో నాణ్యత ప్రమాణాలు తప్పక పాటించాలని.. ఆహార పదార్థాలు శుభ్రతగా ఉండాలని.. లేకపోతే చర్యలు తప్ప వని ఫుడ్ సేఫ్టీ అధికారి హరిత హెచ్చరించారు. ఆదివారం కడప నగరంలోని ద్వారక ఫ్యామిలీ రెస్టారెంట్‌ను తనిఖీ చేశారు. అక్కడ నిల్వ ఉన్న ఆహార పదార్థాలు, కిచెన్‌ను పరిశీలించారు. ఆహార నిల్వలు బిర్యానీ, వెజిటేబుల్‌బిర్యానీ, చిల్లీ చికెన్, మష్రూమ్, రోటీ తదితర పదార్థాల శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపారు. రెస్టారెంట్‌లో పరిశుభ్రతపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ నోటీసులు జారీ చేశారు. ఈ తనిఖీల్లో ఆహార నియంత్రణ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

'గండికోట'లో 20.5 టీఎంసీల నీటిమట్టం



గండికోట ప్రాజెక్టులో ప్రస్తుత నీటిమట్టం

కొండాపురం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టులో 20.545 టీఎంసీల నీటి మట్టం ఉందని... ఇక్కడ నుంచి మైలవరం జలాశయానికి 10,000 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. మైలవరం నుంచి పెన్నానదికి నీరు వదిలేందుకు ఈ నీటిని విడుదల చేస్తున్నామని వెల్లడించారు. ఆదివారం ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో 10,600 క్యూసెక్కులు ఉందన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి జీఎన్ఎస్ఎస్ వరద కాలువ ద్వారా వచ్చే కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 10,400 క్యూసెక్కులు ఉందన్నారు. ప్రాజెక్టులోకి 200 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరినట్లు తెలిపారు. కాగా పైడిపాలెం రిజర్వాయిర్‌కు 700 క్యూసెక్కులు, సీబీఆర్‌కు 1000 క్యూసెక్కులు, జీఎన్ ఎస్ఎస్ మెయిన్ కెనాల్‌కు 300 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు. గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 26.85 టీఎంసీలు అని తెలిపారు.

సైక్లింగ్‌తో శారీరక దృఢత్వం, సంపూర్ణ ఆరోగ్యం

- సైకిల్ ర్యాలీలో ఎస్పీ అశోక్‌కుమార్



సైక్లింగ్ చేస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

కడప(క్రైం), ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): శారీరక దృఢత్వం, సంపూర్ణ ఆరోగ్యా నికి సైక్లింగ్ ఎంతో దోహదపడుతు ందని ఎస్పీ అశోక్‌కుమార్ పేర్కొన్నారు. ఫిట్ ఇండియా కార్యక్ర మంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉత్తర్వుల మేరకు ఆదివారం ఊటుకూరు సర్కిల్ నుంచి రిమ్స్ వరకు సైకిల్ ర్యాలీని ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం సిబ్బందితో కలిసి ఆయన కూడా సైకిల్ ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. సైక్లింగ్ సహజ సిద్ధమైన వ్యాయామమని, ప్రతి రోజూ కనీసం ఒక గంట పాటు సైకిల్ తొక్కినట్లయితే ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. రక్తపోటు, కొలస్ట్రాల్ తగ్గడంతో పాటు మానసిక ఒత్తిడి తగ్గి ప్రశాంతత నెలకొంటుందన్నారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ రమణ య్య, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు శిక్షణా కేంద్రం పరిశీలన

ఇటీవల పోలీసు కానిస్టేబుల్స్‌గా ఎంపికైన అభ్యర్థులకు త్వరలో శిక్షణ ప్రారంభం కానుం ది. ఈ నేపధ్యంలో ఆదివారం ఎస్పీ అశోక్‌కుమార్ కడప నగర శివారులోని పోలీస్ శిక్షణా కేంద్రాన్ని పరిశీలించారు. వసతులు, తరగతి గదులు తదితర వాటి విషయంగా అక్కడి డీఎస్పీ అబ్దుల్ కరీమ్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయనకు పలు సూచనలు చేశారు.

2న మంత్రి లోకేశ్‌తో సెంట్రలైజ్డ్ కిచెన్ ప్రారంభం

- కలెక్టర్ చెరుకూరి శ్రీధర్



స్మార్ట్‌కిచెన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

సీకేదిన్నె, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్‌ను ప్రా రంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కలె క్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ తెలిపారు. చింతకొమ్మదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆధునిక వసతులతో నిర్మించిన సెంట్రలైజ్డ్ స్మార్ట్‌కిచెన్‌ను ఎస్పీ అశోక్‌కుమార్‌తో కలిసి ఆదివారం పరిశీ లించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మా ట్లాడుతూ డొక్కా సీతమ్మ మధ్యాహ్న భో జన పథకం కోసం ఏర్పాటు చేసిన ఆటో మేషన్ సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ షెడ్‌కు సంబంధించిన పనులు పూర్తయ్యాయన్నా రు. వంటసామాన్లు, ఇతర మౌలిక సదు పాయాలను పరిశీలించి ఇంజనీరింగ్ అధి కారులతో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అడి గి తెలుసుకున్నారు. సెంట్రలైజ్డ్ స్మార్ట్‌కిచెన్ ప్రారంభానికి మంత్రి రాను న్న దృష్ట్యా ప్రజాప్రతినిధు లు, ప్రముఖులు, అధిక సం ఖ్యలో ప్రజలు పాల్గొనే అవ కాశం ఉందని, అందుకు త గిన భద్రతా ఏర్పాట్లు చే యాల్సి ఉందని ఎస్పీ అశో క్‌కుమార్‌తో చర్చించారు. ఎ క్కడ ఎటువంటి ఆటంకా లు జరుగకుండా తగిన ఏ ర్పాట్లు చేయాలన్నారు. కా ర్యక్రమంలో కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, డీఈవో షం షుద్దీన్, ఆగ్రోస్ డీఎం విజ యకుమార్, ఎస్ఎస్ఏ, సం బంధిత శాఖల అధికారులు, రెవెన్యూ అధి కారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేసీ కాలువలో యువకుడి గల్లంతు

- లభించని ఆచూకీ





గల్లంతైన యువకుడి కోసం గాలిస్తున్న స్థానిక ప్రజలు, ఇన్‌సెట్‌లో గల్లంతైన యువకుడు షఫిక్ (ఫైల్‌ఫోటో)

దువ్వూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని జిల్లేళ్ల గ్రామాని కి చెందిన నాదేళ్ల షఫిక్ (15) అనే యువకుడు ఆదివారం కేసీ కాలువలో గల్లంతయ్యాడు. ఈ మేరకు యువకుని తండ్రి మహమ్మ ద్ స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యా దు చేశారు. షఫిక్ తన స్నేహితులు కరీముల్లా, కల్యాణ్‌తో కలిసి ఉద యం సమీప కేసీ కాలువ బ్రిడ్జివద్దకు వెళ్లారు. అక్కడ మెట్లలోకి దిగి కాళ్లు శుభ్రపరచుకుంటుండగా జారి కాలువలో పడిపోయాడు. ఇద్దరు స్నేహితు లు పరుగెత్తికెళ్లి పొలాల్లో ఉన్నవారికి ఈ విషయాన్ని చేరవేశారు. అప్పటికే యువకుడు గల్లంతు కావడంతో తల్లిదండ్రులు, బంధువులు కాలువ వెంబ డి వెతకడం ప్రారంభించారు. ఆచూకీ లభించకపోవడంతో స్థానిక పోలీ సుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సంఘటనతో యువకుని తల్లిదండ్రుల్లో ఆందోళన మొదలైంది. కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు.

శాస్త్రోక్తంగా పవిత్రాల ప్రతిష్ఠ



పవిత్రాలను తీసుకువస్తున్న అర్చకులు

ఒంటిమిట్ట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కోదండరామస్వామి వారి ఆలయ పవిత్రోత్సవాల్లో భాగంగా రెండోరోజు పవిత్ర ప్రతిష్ఠ శాస్త్రో క్తంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం సీతారామ లక్ష్మణ ఉత్సవమూర్తులను యాగశాలకు తీసుకువచ్చారు. విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, బలిహారం, శాత్తుమర నివేదన, కుంభారాధన, ఉత్త హోమాలు నిర్వహించారు. తరావత యాగశాలలో పవిత్ర మాలలకు ఉపచారం నిర్వహించి ప్రదర్శనగా సన్నిధికి వేంచేపు చేశారు. ధ్రువమూర్తులకు, కౌతుక మూర్తులకు, స్నపన మూర్తులకు, బలి మూర్తులకు విశ్వక్సేనుల వారికి ద్వార పాలకులకు గరుడాల్వార్లకు యాగశాలలోని హోమగుండాలకు, బలిపీఠానికి, ధ్వజస్తంభానికి, ఆలయం ఎదురుగా గల ఆంజనేయస్వామివారికి సమర్పించారు. కార్య క్రమంలో ఆలయ అధికారి హనుమంతయ్య, ఆలయ ఇన్‌స్పెక్టర్ నవీన్ కుమార్, ఆలయ అర్చకులు వీణరాఘవాచార్యులు, శ్రావణ్‌కుమార్, మనోజ్‌కుమార్, పవన్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

రేణిగుంట-కడప

- కేంద్ర వన్యప్రాణ సంరక్షణ విభాగం అనుమతులు
- నాలుగు లేన్లుగా 122 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం
- రెండేళ్లలో నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఉత్తర్వులు

గ్రీన్ ఫీల్డ్ హైవేకే గ్రీన్ సిగ్నల్

గత కొన్నేళ్లుగా ఉమ్మడి కడప జిల్లా వాసులను ఊరిస్తున్న రేణిగుంట-కడప గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి కేంద్ర వన్యప్రాణి సంరక్షణ శాఖ అనుమతులు ఇచ్చింది. దీంతో ఉమ్మడి కడప జిల్లాతో పాటు కర్నూలు, అనంతపురం, బళ్లారి, మహారాష్ట్ర, తెలంగాణ ప్రయాణికులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. మూడేళ్ల కిందట రోడ్డు నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసి నిధులు విడుదల చేసినా అటవీ, వన్యప్రాణి సంరక్షణ అనుమతులు లేకపోవడంతో ఎక్కడిపనులు అక్కడే ఆగిపోయాయి. ప్రస్తుతం అనుమతులు రావడంతో పనులు ఊపందుకోనున్నాయి.



గ్రీన్‌ఫీల్డ్ హైవే నమూనా

రాజంపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : కడప నుంచి రేణిగుంట వరకు సుమారు 122 కిలోమీ టర్ల దూరం కలిగిన ఈ రోడ్డు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.3232 కోట్లను మూడేళ్ల కిందటే మంజూరు చేసింది. రెండు ప్యాకేజీలుగా రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలని ఆదేశాలు ఇచ్చింది. అయితే అటవీ శాఖ అధికారుల అనుమతులు లేకపోవడం వల్ల ఎక్కడి పనులు అక్కడే నిలిచిపో యాయి. ప్రస్తుతం హైదరాబాదు నుంచి కడపకు నాలుగు లేన్ల రోడ్డు ఉంది. దీనివల్ల తెలంగాణ, మహారాష్ట్ర, కర్నూలు, అనంతపురం వాసులు కడప వరకు సులభంగా ప్రయాణం చేస్తున్నారు. అయితే కడప నుంచి రాజంపేట, కోడూరు మీదుగా చెన్నైకి వెళ్లాలన్నా, తిరుమలకు వెళ్లా లన్నా ఎంతో కష్టతరమైన పని. ఈ రెండు లేన్ల రోడ్డులో ప్రతిరోజూ 3 వేల పైబడి వాహనాలు వెళుతుంటాయి. నిత్యం రోడ్డు ఎంతో రద్దీగా ఉండడం, ఒక వాహనాన్ని దాటి మరో వాహనం వెళ్లలేకపోవడం, ప్రయాణం పూర్తిగా ఆలస్యమ వుతోంది. అంతేగాక వాహనాల రద్దీ వల్ల నిత్యం ప్రస్తుతం ఉన్న రెండు లేన్ల హైవేలో రోడ్డు ప్రమాదాలు జరగడం, ఎంతోమంది ప్రయాణి కులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని ఇటీవల బీజేపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు సాయిలోకేశ్, బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరితో కలిసి కేంద్ర మంత్రి గడ్కరీని కలిసి వినతిపత్రం ఇచ్చారు. వెంటనే స్పందించిన ఆయన సంబంధిత అటవీ అధికారులతో చర్చించి పనులు ప్రారంబానికి అనుమతులు ఇవ్వా లని ఆదేశాలు ఇచ్చారు. దీంతో వన్య ప్రాణి సంరక్షణ అధి కారులు పచ్చజెండా ఊపారు.

కడప నుంచి భాకరాపేట మీదుగా ప్రస్తుతం ఉన్న రెండు వరు సల రహదారిని నాలుగు వరుసలు చేయను న్నారు. అంటే భాకరాపేట నుంచి కడప వరకు ఇప్పుడున్న రోడ్డునే నాలుగు లేన్లుగా విస్తరిస్తారు. భాకరాపేట నుంచి రైల్వేకోడూరు వరకు ప్రస్తుతం ఉన్న రోడ్డు కాకుండా రైల్వేలైను అవతల అటవీ మార్గం ద్వారా సుమారు 82 కిలోమీటర్ల మేర కొత్త గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మిస్తారు. శెట్టిగుంట నుంచి రేణిగుంట వరకు ప్రస్తుతమున్న రెండు లేన్ల రహ దారిని నాలుగు లేన్లుగా వేస్తారు. 122 కిలోమీటర్లు ఉన్న ఈ రహదారిలో కడప నుంచి చిన్నఓరం పాడు వరకు 64 కిలోమీటర్ల రోడ్డును, చిన్నఓరం పాడు నుంచి రేణిగుంట వరకు 54 కిలోమీటర్ల మరో రోడ్డును రెండు ప్యాకేజీలుగా ఏర్పాటు చేస్తారు. ఈ రెండు ప్యాకేజీల రోడ్డు నిర్మాణానికి లక్ష్మీ ఇన్‌ఫ్రా అనే సంస్థ టెండర్లు వేసింది. పనులు ప్రారంభించిన రెండేళ్లకే రోడ్డు నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది. ఈ హైవేలో 55 కిలోమీటర్ల మేర 11 చోట్ల భారీ వంతెనలు నిర్మించనున్నారు. ఆయా ప్రాంతాల్లో మండలాలు, ప్రధాన గ్రామా లకు అనుసంధానంగా అప్రోచ్ రోడ్డును కూడా వేస్తారు. రోడ్డు కిందనే బ్రిడ్జిలు, కాలువలు ఏర్పాటు చేస్తారు. బాలుపల్లె అటవీ మార్గంలో శెట్టిగుంట నుంచి బాలుపల్లె ప్రాంతంలో వన్యప్రా ణులు అటు ఇటు తిరగడానికి రోడ్డు కింద మార్గాలు ఏర్పాటు చేస్తారు. ఈ జాతీయ రహదా రిని 716 అని పిలుస్తారు. రహదారి వెనువెంటనే ప్రారంభించి రెండేళ్లలో పూర్తి చేస్తే ఉమ్మడి కడప జిల్లా వాసులతో పాటు మహారాష్ట్ర, తెలంగాణ, బళ్లారి వాసులకు సులభంగా ప్రయాణం జరిగి శ్రీవారి దర్శనాన్ని సులభతరం చేసుకోవడంతో పాటు చెన్నైకి కూడా త్వరితగతిన చేరుకుంటారు. రోడ్డు ప్రమాదాలు కూడా తగ్గుతాయి.



కడప - రేణిగుంట గ్రీన్‌ఫీల్డ్ మార్గం

మోటారు సైకిల్‌ను ఢీకొన్న కారు

- అక్కడికక్కడే మృతి చెందిన బొప్పాయి కార్మికురాలు
- మరో ఇరువురికి తీవ్ర గాయాలు

రైల్వేకోడూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మోటారు సైకిల్‌ను కారు ఢీకొనడంతో బొప్పాయి కార్మికురాలు అక్కడికి అక్కడే మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మరో ఇరువురు కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. ఆ వివరాల్లోకి వెళితే.. మండలంలోని సూరపు రాజుపల్లె క్రాస్ రోడ్డు ప్రధానదారికి పక్కనే ఉన్న సూరపురాజు పల్లె గిరిజనకాలనీ నుంచి రైల్వేకోడూరు వైపు మోటారుసైకిల్‌లో మహేష్, వీరయ్య, వెంకటమ్మ వెళుతుండగా తిరుపతి నుంచి రైల్వేకోడూరు వైపు వెళుతున్న ఓ కారు వెనక వైపు నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటమ్మ (30) అక్కడికి అక్కడే మృతి చెందగా మహేష్, వీరయ్యలు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ముగ్గురూ బొప్పాయి కూలీలు. వీరు చిట్వేలి మండలం చింతల చెలిక గ్రామానికి చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. గాయపడిన వారికి ప్రథమ చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


మృతి చెందిన వెంకటమ్మ

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కలకడ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): విష ద్రావణం తాగి ఆత్మహత్యకు ప్రయత్నించిన ముల్లగూరి సోమశేఖర్ (54) చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని గంగాపురం పంచాయతీ రంగప్పగారిపల్లికి చెందిన సోమశేఖర్‌కు తన చెల్లెలుతో భూ సమస్యలు వున్నట్లు తెలిపారు. దీంతో మనస్తాపం చెందిన సోమశేఖర్ శనివారం ఉదయం పొలం వద్ద విష ద్రావణం తాగి అపస్మారక స్థితిలో వుండగా గమనించిన కుటుంబ సభ్యులు తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందాడన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి

పీలేరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): పీలేరు ప్రభుత్వ ఆస్పత్రిలో హనుమంతు అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈనెల 19వ తేదీన పీలేరు రైల్వే స్టేషన్ వద్ద అపస్మారక స్థితిలో ఉన్న ఆయనను స్థానికులు 108 వాహనంలో పీలేరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారని తెలిపారు. కాస్త కోలుకున్నాక తనది అనంతపురం జిల్లా ఉరవకొండ అని తెలిపాడని, చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడని తెలిపారు. మృతుడి వివరాలు తెలిసినవారు 9440764744, 9440796745 నెంబర్లకు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు.


హనుమంతు మృతదేహం

ఉరి వేసుకుని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

ప్రొద్దుటూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం వసంతపేటకు చెందిన ఉమ్మడిశెట్టి లక్ష్మీప్రసాద్ అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి శనివారం రాత్రి మేడ పైన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన జరిగింది. ఆ వివరాల్లోకి వెళితే... సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అయిన ఉమ్మడిశెట్టి లక్ష్మీప్రసాద్‌కు రెండేళ్ల క్రితం ఎర్రగుంట్లకు చెందిన చంద్రకళా అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగినితో వివాహమైంది. పెళ్లైన వారం రోజులకే దంపతుల మధ్య విభేదాలు రావడంతో వేర్వేరుగా కాపురం వుంటున్నారు. ఇటీవల లక్ష్మీప్రసాద్‌కు కిడ్నీ సమస్య వచ్చింది. దీనికితోడు భార్య సమస్య కారణంగా మనస్తాపానికి గురయ్యాడు. హైదరాబాదులోని తన ఇంటిలో శనివారం రాత్రి భోజనం అయ్యాక మేడపైన నిద్రపోవడానికి వెళ్లాడు. తండ్రి వెంకటసుబ్బన్న మేడపైకి వెళ్లి చూసేసరికి తలుపులు వేసి వున్నాడు. కిటికీలో నుండి చూడగా ఫ్యానుకు ఉరి వేసుకుని వేలాడుతూ కనపడ్డాడు. దీంతో వెంటనే లక్ష్మీప్రసాద్‌ను కిందకి దించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్ఐ సంజీవరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మృతి చెందిన ఉమ్మడి శెట్టి లక్ష్మీప్రసాద్ ఫైల్ ఫోటో

కత్తితో దాడి : ఒకరికి గాయాలు

కమలాపురం రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రామచంద్రాపురం గ్రామ సమీపంలో స్నేహితుల మధ్య మాటామాట పెరిగి గొడవకు దారి తీసిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... చదిపిరాళ్ల గ్రామానికి చెందిన శివారెడ్డికి వల్లూరు మండలం పెద్దపుత్త గ్రామానికి చెందిన గోవర్ధన్‌రెడ్డి రూ.4500 బాకీ ఉన్నాడు. ఆ డబ్బు సోమవారం ఇస్తానని చెప్పేందుకు ఆదివారం గోవర్ధన్‌రెడ్డి రామచంద్రాపురం వద్ద ఉన్న శివారెడ్డి ఎద్దుల షెడ్డు వద్దకు వెళ్లాడు. తనకు అవసరం ఉందని, వెంటనే బాకీ ఇవ్వాలని శివారెడ్డి కోరాడు. ఇంతలో వల్లూరు మండలం కట్టు గ్రామానికి చెందిన ఆది నాగరాజు, వినోద్, చరణ్‌తేజ్‌తో పాటు మరికొందరు అక్కడికి చేరుకున్నారు. ఏం జరిగిందో తెలియదు... స్నేహితులైన గోవర్ధన్‌రెడ్డి, నాగరాజుల మధ్య మాటామాటా పెరిగి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ దాడిలో నాగరాజు మెడపై కత్తి పోట్లు కావడంతో గాయాలయ్యాయి. అక్కడున్న వారు సర్దిచెప్పి చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు పూర్తి స్థాయిలో విచారించి, కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.


గాయపడిన నాగరాజు

ద్విచక్ర వాహనం చోరీ

సిద్దవటం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కడప-చెన్నై జాతీయ రహదారి బాకరాపేట ప్రాంతంలోని కాశినాయన గుడి సమీపాన ద్విచక్ర వాహనం చోరీ గురైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. రైతు వెంకటసుబ్బారెడ్డి ఆదివారం సాయంత్రం కాశినా యన గుడి సమీపాన ఉన్న తన పొలం వద్ద ద్విచక్ర వాహనం నిలిపి పనులు చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనం చోరీ గురైందని రైతు తెలిపారు. ఈ విషయమై ఎస్ఐ మహమ్మదర్‌పీర్ విచారణ కోరగా ఈ చోరీపై విచారణ చేపట్టామన్నారు.


చోరీకి గురైన బైక్

పాత బిల్లులకు మోక్షం ఎప్పుడో..?

- కలగా మరిన పాత బిల్లుల మంజూరు
- ఏడు సంవత్సరాలుగా తెలుగు తమ్ముళ్ల ఎదురుచూపులు
- మొత్తం రూ.10 కోట్ల మేరకు పెండింగ్‌లోనే..
- బిల్లుల మంజూరు కోసం మంత్రి ప్రత్యేక చొరవ


నూలివీడులో బిల్లులకు నోచుకోని డంపింగ్ యార్డు

గాలివీడు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్న 2014-19 మధ్యకాలంలో గ్రామాల్లోని టీడీపీ నాయకులు లక్షల రూపాయలు అప్పులు చేసి గ్రామాల్లో సిమెంటు రోడ్లు, డంపింగ్ యార్డులు, ఫార్మేషన్ రోడ్లు, గ్రావెల్ రోడ్లు, చెక్‌డ్యాంల మరమ్మతులు, కొత్త చెక్‌డ్యాంల నిర్మాణాలు కల్లాలు (పంట మార్పులు), పాఠశాలల దగ్గర ఆట స్థలాలు వంటి పనులను ఉపాధి హామీ నిధులతో చేపట్టారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం టీడీపీ నాయకులు చేసిన పనులకు బిల్లులు ఇవ్వకుండా పెండింగ్‌లో పెట్టేసింది. దీంతో అప్పులు చేసి పనులు చేసిన టీడీపీ నాయకులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. ఏడు సంవత్సరాలుగా చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో చేసిన అప్పులకు వడ్డీలు కూడా చెల్లించుకోలేక నరక యాతన అనుభవిస్తున్నారు. టీడీపీ నాయకులు చేసిన పనులకు అప్పటి వైసీపీ నాయకులు బిల్లులు చేసుకొన్నారు. ఈ నేపథ్యంలో పనులు చేసి బిల్లులు రాని టీడీపీ నాయకుల కోసం అప్పట్లో చంద్రబాబు నాయుడు తాము అధికారంలోకి వచ్చిన వెంటనే వడ్డీతో సహా చెల్లించి పనులు చేసిన వాళ్లను ఆదుకుంటామని ప్రతి మీటింగ్‌లోనూ చెబుతూ వచ్చారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఆ బిల్లులకు మోక్షం కలగలేదు. ఒక్క నీరు-చెట్టు బిల్లులు తప్ప ఉపాధి హామీ ద్వారా చేపట్టిన పనులకు సంబంధించి ఇంతవరకు ఒక్క రూపాయి కూడా బిల్లులు చెల్లించలేదని టీడీపీ నాయకులు చెబుతున్నారు. అయితే గత వారం క్రితం పెండింగ్ బిల్లులకు సంబంధించి ఒక జాబితా సీఆర్‌డీఏ నుంచి మండల స్థాయి అధికారులకు వచ్చింది. ఆ జాబితాతో కేవలం రూ.7 వేలు మాత్రమే విత్‌డ్రా అమౌంట్ వచ్చినట్లు టీడీపీ నాయకులు పేర్కొన్నారు. మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో నాడు ఉపాధి హామీ నిధులతో రూ.10 కోట్ల మేర వివిధ రకాల అభివృద్ధి పనులను టీడీపీ నా యకులు చేశారు. అందులో ఆగస్టులో రూ. 3కోట్ల 80లక్షల పనులు చేసిన వారి అకౌంట్లలో జమ అయింది. విషయం తెలుసుకొన్న వైసీపీ నాయకులు దురుద్దేశంతో జిల్లా స్థాయి ఉపాధి అధికారులతో ఒత్తిడి చేయించి డబ్బులు పడిన వారి అకౌంట్లను డ్రా చేయనీయకుండా బ్లాక్ చేయించారు. దీంతో వీరు ఇప్పటికీ డబ్బులను డ్రా చేసుకోలేకపోయారు. మండలంలోని గాలివీడులోని ఎస్‌బీఐలో బిల్లులకు సంబంధించిన డబ్బులనే కాకుండా అంతకు ముందు ఉన్న డబ్బులను కూడా డ్రా చేసుకోలేకుండా పోతున్నామని బ్లాక్ చేసిన అకౌంట్‌దారులు వాపోతున్నారు. సీసీపల్లె పంచాయతీ నల్లగుండ్లపల్లెకు చెందిన ఒక వ్యక్తికి చెందిన అకౌంట్‌లో ఆగస్టు 2022లో రూ.2 లక్షల మేర బిల్లులు జమ కావడం జరిగిందని, వెంటనే తన అకౌంట్‌ను బ్లాక్ చేశారని, అంతకు ముందు తన అకౌంట్‌లో ఉన్న డబ్బులను కూడా ఇప్పటికీ విత్‌డ్రా చేసుకోలేకపోతున్నానని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.70 లక్షలు బిల్లులు అకౌంట్‌లో జమ కావడంతో ఆ అకౌంట్‌ను బ్లాక్ చేయడం జరిగిందని ఎగువ గొట్టివీడుకు చెందిన మరొక బాధితుడు తెలిపారు. నూలివీడులోని ఏపీజీబీ, గాలివీడులోని ఏపీజీబీ, కార్పొరేషన్ బ్యాంకుల అకౌంట్లలో పడిన బిల్లులను మరునటిరోజే అప్పటి జిల్లా అధికారులు తిరిగి వేరే అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేసుకున్నారని, ఆ డబ్బులను కూడా ఇంతవరకు తిరిగి అకౌంట్‌లో జమ చేయలేదని మరికొంత మంది వాపోయారు. మొత్తం 4 బ్యాంకుల్లో వంద మందికిపైన టీడీపీ వారికి సంబంధించి రూ.3 కోట్ల 80 లక్షల వరకు డ్రా చేసుకోకుండా నిలుపుదల చేశారన్నారు. ఇవేకాకుండా 2017-19 మధ్యకాలంలో డంపింగ్ యార్డు, ఫార్మేషన్ రోడ్లు, కల్లాలు, చెక్‌డ్యాంల నిర్మాణాలు వంటివి ఉపాధి హామీ నిధులతో చేపట్టారు. అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం వీరు చేసిన పనులకు బిల్లులు చెల్లించకుండా ఐడీ నెంబర్లను, పీటీవో (ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్)లను కూడా బ్లాక్‌లో పెట్టి వైసీపీ నాయకులు అడ్డుకున్నారని తెలిపారు. నూలివీడు పంచాయతీలో 2018సెప్టెంబర్‌లో డంపింగ్ యార్డు నిర్మాణాన్ని చేపట్టామని, 24-12-2018 నాటికి ఆ పనులను పూర్తి చేశామని, ఈ పనికి సంబంధించి వర్క్ ఐడీ నెంబర్ 1111535004004171029 అని, ఎంబుక్ నెంబర్ 025/54 అని, ఈ పనికి సంబంధించి ఆనాడు రూ. 4,56,197 ఎఫ్‌టీవోను కూడా చేశారని, కానీ ఇంతవరకు ఒక్క రూపాయి కూడా రాలేదని మరో బాధితుడు పేర్కొన్నారు. కానీ వారం క్రితం ఈ డంపింగ్ యార్డుకు సంబంధించి కేవలం రూ.28,877 మాత్రమే నిధులను విడుదల చేసినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పెండింగ్ బిల్లులు మండల వ్యాప్తంగా రూ.5 కోట్ల మేర ఉన్నట్లు టీడీపీ నాయకులు పేర్కొన్నారు. బ్లాక్ చేసిన అకౌంట్లు తిరిగి ఓపెన్ చేయించి కాంట్రాక్టర్లకు బిల్లులు ఇప్పించడానికి, పెండింగ్‌లో ఉన్న బిల్లులను మంజూరు చేయించడానికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు టీడీపీ నాయకులు పేర్కొన్నారు. ఏది ఏమైనా పెండింగ్ బిల్లులు చెల్లించి తమను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఎంపీడీవో వివరణ

మండలంలో 2017-19 మధ్యకాలంలో చేసిన కొన్ని పనులకు సంబంధించి బ్యాంకు అకౌంట్లను బ్లాక్ చేసిన మాట నిజమే నని, ఈ పనిని అప్పటి అధికారులు చేశారని ఎంపీడీవో చంద్రమౌళీశ్వర్ తెలిపారు. ఇంకా కొన్ని పనులకు సంబంధించి ప్రభుత్వం విత్‌డ్రా అమౌంట్ వచ్చిందని, దీంతో పాటు ఇంకా కొన్ని పెండింగ్ బిల్లులు ఉన్నాయని, వీటికి సంబంధించి సీఆర్‌డీఏ అధికారులకు నివేదికలు పంపుతామన్నారు.

ఘనంగా గోవర్ధన్‌రెడ్డి కుమార్తె వివాహ రిసెప్షన్

కడప ఎర్రముక్కపల్లి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సింగారెడ్డి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె సాయినేత్రికారెడ్డి, అల్లుడు దుర్గామహేశ్వరరెడ్డిల వివాహ రిసెప్షన్ ఆదివారం నగరంలోని మాధవి కన్వెన్షన్‌లో ఘనంగా జరిగింది. నెల్లూరు జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి శ్రీదేవి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, రాష్ట్ర భవనాలు, రహదారుల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, మాజీ మంత్రి అంజాద్‌బాషా, కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎస్పీ అశోక్‌కుమార్, ఎమ్మెల్యేలు వరదరాజులరెడ్డి, ఆర్.మాధవి, కృష్ణచైతన్యరెడ్డి, బద్వేలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ రితేష్‌రెడ్డి, టీడీపీ మాజీ జిల్లా అధ్యక్షుడు లింగారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ ఎమ్మెల్యేలు వీరశివారెడ్డి, పల్లె రఘునాథరెడ్డి, ద్వారకనాథరెడ్డి, ఆర్టీసీ మాజీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్, పులివెందుల జడ్పీటీసీ లతారెడ్డి, సీఎం సురేష్‌నాయుడు, సుగవాసి బాలసుబ్రమణ్యం, మేడా మధుసూదన్‌రెడ్డి, ప్రొద్దుటూరు ఉక్కు ప్రవీణ్, అమీర్‌బాబు, లక్ష్మిరెడ్డి, సాయినాథ్ శర్మ, టీడీపీ నాయకులు, వివిధ రంగాల ప్రముఖులు దంపతులను ఆశీర్వదించారు.


నూతన దంపతులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే ఆర్.మాధవి.. చిత్రంలో గోవర్ధన్‌రెడ్డి

జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం ప్రధాన కార్యదర్శిగా

చంద్రశేఖర్‌రావు ఎన్నిక

జమ్మలమడుగు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణానికి చెందిన డి.చంద్రశేఖర్‌రావు ఆదివారం కడప జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా నూతన ప్రధాన కార్యదర్శిగా రెండవసారి ఎన్నికయ్యారు. కడపలో జరిగిన కార్యవర్గ ఎన్నికలో తనను ఎన్నుకున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఆగస్టు 2023 జరిగిన కౌన్సిల్ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శిగా అప్పట్లో ఎన్నిక కాగా ఈ ఆదివారం రెండవసారి ఎన్నికైనట్లు వివరించారు. ఈయన జమ్మలమడుగులో మండల విద్యాశాఖాధికారిగా ఉన్నారు. కాగా జిల్లా అధ్యక్షుడిగా జి.వి.సుబ్బారెడ్డి (బద్వేలు), కోశాధికారిగా శ్రీనివాసరెడ్డి (హెచ్‌ఎం, పెన్నానగర్, ప్రొద్దుటూరు), జమ్మలమడుగు డివిజన్ వైస్‌ప్రెసిడెంట్‌గా సూర్యనారాయణరెడ్డి (హెచ్‌ఎం, లక్ష్మీపేట), జిల్లా జాయింట్ సెక్రటరీగా జి.బాలయ్య (హెచ్‌ఎం, వేపరాల), రాష్ట్ర కౌన్సిల్‌గా ఎన్.లక్ష్మీనారాయణరెడ్డి (జడ్పీహెచ్‌ఎస్, తొండలదిన్నె)లను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.



పోలీసు రక్షణ కోరిన ప్రేమజంట


పోలీసుస్టేషన్‌కు వచ్చిన ప్రేమజంట

మదనపల్లె అర్బన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): తమ పెద్దల నుంచి రక్షణ కల్పించాలని కులాంతర వివాహం చేసుకున్న ఓ ప్రేమజంట ఆదివారం తాలుకా పోలీసులను ఆశ్రయించారు. మదనపల్లె మండలం కొత్తపల్లె గ్రామం ఈశ్వరమ్మ కాలనీకి చెందిన హేమంత్ నాయక్, నెమలినగర్ వడ్డిపల్లెకు చెందిన గాయత్రి ఐదేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. అయితే కులాలు వేరుకావడంతో పెద్దలు పెళ్లికి అంగీకరించలేదని, రెండు రోజుల కిందట ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయి మదనపల్లె పట్టణ శివారులోని ఓ గుడిలో వివాహం చేసుకున్నారు. ఈ మేరకు పెద్దల నుంచి రక్షణ కోరుతూ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇద్దరూ మేజరు కావడంతో రక్షణ కల్పిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆఫ్‌లైన్ దరఖాస్తులకు డీడీలు కూడా చెల్లుబాటు

- ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్

మదనపల్లె టౌన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాలో 11 బార్లకు నిర్వహించనున్న లక్కీ డ్రాలో పాల్గొనేవారు ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లో కూడా దరఖాస్తులు ఇవ్వవచ్చని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ దరఖాస్తులకు, ఆన్‌లైన్‌లోనే డిపాజిట్లు, ప్రాసెసింగ్ ఫీజులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అదే ఆఫ్‌లైన్ దరఖాస్తులకైతే డీడీ ద్వారా డిపాజిట్, ప్రాసెసింగ్ ఫీజులు చెల్లించవచ్చన్నారు. ఈనెల 26వ తేదీ సాయంత్రం 5గంటలకు పూర్తి చేసిన దరఖాస్తులను రాయచోటిలోని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో అందించాలని ఆయన తెలిపారు.

కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(నేతాజీ సర్కిల్), ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో సోమవారం ఉదయం 10 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీ దారులు తమ అర్జీలను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కానీ అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రావాలని తెలిపారు.

బీజేపీ చేతిలో జగన్ కీలుబొమ్మ : తులసిరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి

రాయచోటిటౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన అభ్యర్థి రాధాకృష్ణన్‌కు మద్దతు ప్రకటించాలని వైసీపీ నిర్ణయించడం ద్వారా జగన్ నిజస్వరూపం మరోసారి బహిర్గతమైందని, బీజేపీ చేతిలో జగన్ కీలుబొమ్మగా మారారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేత డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి ఆరోపించారు. ఆదివారం ఆయన రాయచోటిలో మీడియాతో మాట్లాడుతూ బీజేపీ చేతిలో జగన్ కీలు బొమ్మ అని మరోసారి రుజువైందన్నారు. రాష్ట్రానికి అన్యాయం చేసిన మోదీ ప్రభుత్వం బలపర్చిన ఉపరాష్ట్రపతి అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని టీడీపీ, జనసేన, వైసీపీ నిర్ణయించడం చాలా దురదృష్టకరం అన్నారు. రాష్ట్రంలో కుస్తీ, హస్తినలో దోస్తీ అన్నట్లుగా వైసీపీ, టీడీపీల లాలూచీ వ్యవహారం ఉందన్నారు. బాబుకు ఓటేసినా, బీజేపీకి ఓటేసినట్లే, జనసేనకు ఓటేసినా బీజేపీకి ఓటేసినట్లే, జగన్ పార్టీకి ఓటేసినా బీజేపీకి ఓటేసినట్లే అనే ఈ వాస్తవాన్ని రాష్ట్ర ప్రజలు గుర్తించాలని తులసిరెడ్డి అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లాబకష్, సీనియర్ నాయకుడు ఎస్ఎండీ గౌస్, రాష్ట్ర మైనార్టీ వైస్ చైర్మన్ మహమ్మద్‌రఫీ, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరును అభివృద్ధి చేసి చూపిస్తా

- ముక్కా సమక్షంలో టీడీపీలో చేరిన 200 వైసీపీ కుటుంబాలు


ముక్కా సమక్షంలో టీడీపీలో చేరుతున్న వైసీపీ నాయకులు, కార్యకర్తలు

రైల్వేకోడూరు రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తామని టీడీపీ ఇన్‌చార్జ్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. ఆదివారం రైల్వేకోడూరు మండలంలోని బొజ్జావారిపల్లె పంచాయతీ పరిధిలో ఉన్న దాదివారిపల్లె, దళితవాడ, వడ్డిపల్లె గ్రామాలకు చెందిన 200 మంది వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పుల్లంపేట, పెనగలూరు మండలాల్లో ఇప్పటికే సుమారు రూ.80 కోట్ల మేరకు వివిధ రకాల అభివృద్ధి పనులు నిర్వహించినట్లు తెలిపారు. రైల్వేకోడూరులో త్వరలో అన్నా క్యాంటిన్ ప్రారంభిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిల సారథ్యంలో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని తెలిపారు. అనంతరం దాదివారిపల్లె, దళితవాడ, వడ్డిపల్లె గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు నందలూరు సుబ్రహ్మణ్యంరెడ్డి అలియాస్ చిట్టి ఆధ్వర్యంలో 35 కుటుంబాలు, నందలూరు శ్రీనివాసులురెడ్డి, చిన్నపోలు జయరామిరెడ్డి, నందలూరు సుబ్బరామిరెడ్డి, జోగి పట్టాభిరెడ్డి, సింగమాల వెంకటరెడ్డి తదితర నాయకుల ఆధ్వర్యంలో 165 కుటుంబాలు ముక్కా సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

- ఫిట్ ఇండియా సండేస్ ఆన్ సైకిల్ కార్యక్రమంలో డీఎస్పీ

రాయచోటిటౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాలతో ఆదివారం రాయచోటి పట్టణంలోని పోలీసు ప్రధాన కార్యాలయం నుంచి సండేస్ ఆన్ సైకిల్ కార్యక్రమాన్ని రాయచోటి డీఎస్పీ ఎంఆర్ కృష్ణమోహన్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ కృష్ణమోహన్ మాట్లాడుతూ ప్రజలు, పోలీసులు కలిసి ప్రతి ఆదివారం సైక్లింగ్ అలవాటు చేసుకోవడం ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతతతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. సైక్లింగ్ అనేది కేవలం ఒక వ్యాయామం మాత్రమే కాదని, అది మన మనస్సుకు ఉత్సాహాన్ని ఇస్తుందన్నారు. అలాగే యోగా సాధన మనలోని ఏకాగ్రతను పెంచి మానసిక ప్రశాంతతకు తోడ్పడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా ప్రతి ఆదివారం సండేస్ ఆన్ సైకిల్ కార్యక్రమంలో పాల్గొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్, లక్కిరెడ్డిపల్లె సీఐ కొండారెడ్డి, రిజర్వు ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, ఎం.పెద్దయ్య, పలువురు ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, హోంగార్డులు పాల్గొన్నారు.



సండేస్ ఆన్ సైకిల్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీఎస్పీ కృష్ణమోహన్



28 నుంచి రంగనాథస్వామి నూలుపూజ పవిత్రోత్సవాలు

పులివెందుల ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): పులివెందుల్లో వెలసిన రంగనాథస్వామికి నూలుపూజ పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి రమణ తెలిపారు. ఈ పవిత్రోత్సవాలు 28వ తేదీ గురువారం నుంచి సెప్టెంబరు 5వ తేదీ శుక్రవారం వరకు ఈ పవిత్రోత్సవాలు సాగుతాయన్నారు. చివరిరోజున ఉదయం 10.30గంటలకు రంగనాథస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తారన్నారు. 28న ఉదయం అభిషేకం, సాయంత్రంగ్రామోత్సవం నిర్వహిస్తారన్నారు. 29న శుక్రవారం అభిషేకం, సాయంత్రం ఊరేగింపు కార్యక్రమం ఉంటుందన్నారు. 30వ తేదీ శనివారం ఉదయం అభిషేకం, సాయం త్రం గరుడ వాహనంపై ఊరేగింపు ఉంటుందన్నారు. 31వ తేదీ ఉదయం అభిషేకం సాయంత్రం శేష వాహనంపై ఊరేగిస్తామన్నారు. సెప్టెంబరు 1న సాయంత్రం చంద్రప్రభ వాహనంపై ఊరేగింపు ఉంటుందన్నారు. 2వ తేదీ ఉదయం అభిషేకం, సాయంత్రం హనుమంత వాహనంపై ఊరేగింపు ఉంటుందన్నారు. 3న బుధవారం సాయంత్రం అశ్వవాహనంపై ఊరేగింపు ఉంటుందన్నారు. 4వ తేదీ గురువారం సాయంత్రం హంస వాహనంపై ఊరేగింపు ఉంటుందన్నారు. 5వ తేదీ సాయంత్రం గజవాహనంపై ఊరేగింపు కార్యక్రమం ఉంటుందన్నారు.

విజయపథంలో విద్యాసాగర్ ఆసుపత్రి



కేక్ కట్ చేస్తున్న డాక్టర్ విద్యాసాగర్‌రెడ్డి తదితరులు

ఎర్రముక్కపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): : కడప నగరం మారుతీనగర్‌లోని విద్యాసాగర్ ఆర్థోపెడిక్ హాస్పిటల్‌లో 500 రోబోటిక్ మోకాళ్ల మార్పిడి శస్త్ర చికిత్సలు విజయవంతంగా పూర్తిచేసుకొని ఆ 500 మంది జీవితాలలో మార్పు తెచ్చి వారిలో ఆత్మ విశ్వాసాన్ని నింపామని డాక్టర్ విద్యాసాగర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా ఎముకలు, కీళ్ళ సంరక్షణలో విశేష సేవలందిస్తూ 7500లకు పైగా మోకీలు మార్పిడి శస్త్ర చికిత్సలు, అధునాతన జాయింట్ రీప్లేస్‌మెంట్ సాంకేతికతో ముందడుగు నిలిచామని తెలిపారు.

సోలార్‌ప్యానల్ ఏర్పాటు చేసుకోండి

ట్రాన్స్‌కో ఎస్‌ఈ రమణ



పథకాన్ని వివరిస్తున్న రమణ

చెన్నూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఇంటి కప్పులపై సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకుని ఉచితంగా విద్యుత్‌ను ఉపయోగించుకోవాలని ట్రాన్స్‌కో ఎస్‌ఈ రమణ తెలిపారు. చెన్నూరులో ఆదివారం పలు ప్రాంతాల్లో ఇళ్ల వద్దకు వెళ్లి సోలార్ విద్యుత్ వల్ల వినియోగదారుడికి కలిగే లాభాలను వివరించారు. సిబిల్ స్కోర్ బాగుంటే బ్యాంకులనుంచి సోలార్ విద్యుత్ కోసం సబ్సిడితో రుణం అందిస్తామన్నారు. అలాగే ప్రతి నెలా వచ్చే విద్యుత్ బిల్లు ఎంత ఉంటుందో ఆ బిల్లును బ్యాంకు నుంచి వచ్చే సబ్సిడీ పోను మిగలిన మొత్తానికి నెలవారీ కంతులుగా చెల్లించవచ్చు అన్నారు. అలాగే ఒక్క మారు సోలార్ విద్యుత్ కోసం ప్లానెల్ ఏర్పాటు చేసుకుంటే ఐదు సంవత్సరాల పాటు ఉంటాయని, మరమ్మతు వచ్చినా ఏర్పాటు చేసిన వారే సరి చేసి ఇస్తారన్నారు. దీని వల్ల వాతావరణ కాలుష్యాన్ని తగ్గించవచ్చు అన్నారు.

'ఆ ముగ్గురూ బీజేపీ తొత్తులే'

కడప మారుతీనగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, వైసీపీ అధ్యక్షుడు జగన్‌రెడ్డి ముగ్గురూ కూడా బీజేపీ తొత్తులే అని మరోసారి నిరూపించారని కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకుడు సత్తార్ అన్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో బీజేపీ నాయకత్వం లోని ఎన్డీఏ అభ్యర్థి రాధాకృష్ణన్‌కు బాబు, పవన్, జగన్‌రెడ్డి బే షరతుగా మద్దతివ్వడంతో వీరు మైనార్టీలకు వ్యతిరేకమనే సంగతి బహిర్గతమైందన్నారు. సమావేశంలో నాయకులు నాసిర్‌ఖాన్, అక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ తొక్కండి ఆరోగ్యంగా ఉండండి



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న డీఎస్పీ తదితరులు

పులివెందుల, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): సైకిల్ తొక్కండి ఆరోగ్యంగా ఉండండి అని పులివెందుల్లో డీఎస్పీ మురళీ నాయక్ ఆధ్వర్యంలో సైక్లింగ్ నిర్వహించారు. ఆదివారం అర్బన్ పోలీసుస్టేషన్ పూల అంగళ్లమీదుగా పాత బస్టాండ్ వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ప్రతి రోజూ సైక్లింగ్ నిర్వహించే ఎవరైనా ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రతి ఒక్కరూ దినచర్యలో భాగంగా ఈ కార్యక్రమాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ హాజీవల్లి, రూరల్ సీఐ రమణ, ఎస్‌ఐ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణుల సమస్యలను పరిష్కరించండి



మాట్లాడుతున్న గోపాలకృష్ణశర్మ

కడప కల్చరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణుల న్యాయమైన సమస్యలను త్వరిత గతిన పరిష్కరించేలా రాష్ట్రంలో సుపరిపాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వం స్పందించాలని అర్చకపు రోహిత సంఘం అధ్యక్షుడు పిడతల గోపాలకృష్ణశర్మ కోరారు. బ్రాహ్మణ చైతన్య వేదిక ఆధ్వర్యం లో ఆదివారం ఆకుల వీధిలో వెలసిన రాజరాజేశ్వరీదేవస్థానం ఆవరణలో బ్రాహ్మణ సమ్మేళనం నిర్వహించారు. బ్రాహ్మణ చైతన్యవేదిక రాష్ట్ర ప్రచార కమిటీ అధ్యక్షుడు ఎస్. ర ఘునాథరావు అధ్యక్షతన జరిగిన సమ్మేళన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. రాజకీయ రంగంలో బ్రాహ్మణులకు తగిన గుర్తింపు ఇవ్వాలన్నారు. పార్టీ పదవులలో, నామినేటెడ్ పదవులలో సైతం అవకాశం కల్పించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు బి. చంద్రమౌళీశర్మ, సి.హనుమంతరావు, టి. అనంతకుమారి, ఎ.సుబ్బారావు, ఎన్. నరేష్, ఎ. లక్ష్మీదేవి. ప్రసాదరావు, మాజీ కార్పొరేటర్ సురేష్, న్యాయవాది సురేష్, సాయి, శ్రీధర్‌రావు పాల్గొన్నారు.

ఉద్యోగులకు కరువు భత్యం ప్రకటించాలి

పోరుమామిళ్ల ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు వెంటనే పీఆర్సీ, ఐఆర్ కరువు భత్యం ప్రకటించాలని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఏపీటీఎఫ్ రీజి యన్ కార్యాలయంల జరిగిన సమవేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు, ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వ మెమో 57 ద్వారా పాత పెన్షను అమలు చేయాలని కోరారు. ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమా లకు వాడరాదన్నారు.

ఘనంగా తులకాంతమ్మ జాతర

సీకేదిన్నె, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె మండలం మామిళ్లపల్లె పంచాయతీ అంగడివీధిలో వెలసిన తులకాంతమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం శ్రావణమాసం ముగిసిన ఆదివారం తులకాంతమ్మ జాతరను నిర్వహిస్తుంటారు. అందులో భాగంగా ఆదివారం భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలు సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని దర్శించుకున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వవిద్యార్థులు, ఉపాధాయుల ఆత్మీయ సమ్మేళనం

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని స్వాతి హైస్కూల్ 1995-96 బ్యాచ్ పదో తరగతి పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మే ళనం ఆదివారం ఓ ఫంక్షన్ హాల్‌లో వేడుకగా జరిగింది. 30 సంవత్సరాల తర్వాత కలుసుకున్న పూర్వవిద్యార్థులు ఆత్మీయ ఆలింగనం,చిరునవ్వుల పలకరింపులతో సందడిగా సాగింది. తమకు విద్యాబుద్ధులు నేర్పితమ ఉన్నతికి సహకరించిన ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు.అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చు కోవాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక,తాత్విక చింతన అలవర్చు కోవాల్సిన అవసరం ఎంతో ఉందని ఒంటిమిట్ట మండల విద్యాధికారి డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య తెలిపారు. కడప నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలోని రామాలయంలో ఆదివారం కొత్తపల్లె రామాంజనేయులు రచించిన ఉదయ సిందూరం పుస్తకావిష్కరణ సభ జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒంటిమిట్ట చెరువు, బౌద్ధ ఆరామాలు, కోదండ రామాలయంతో ఉన్న అనుబంధంతో ఆలయ ప్రత్యేకతల గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో కొండూరు జనార్ధన రాజు, లయన్ చిన్నపరెడ్డి,డాక్టర్లు సాయి ప్రసాద్,శ్యామ సుందర్రెడ్డి, వెంకటేశ్వర ఆచారి, జానుమద్ది విజయ భాస్కర్ పాల్గొన్నారు.

దాడి కేసులో యువకుడి అరెస్ట్

కడప క్రైం ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రవీంద్రనగర్‌లో యువకుడిపై రంపంతో దాడి చేసిన కేసులో యువకుని అరెస్ట్ చేసినట్లు తాలూకా పోలీసులు తెలిపారు. రవీంద్రనగర్‌కు చెందిన గణేశ్ ఓ మహిళతో రవీంద్రనగర్‌లో సహజీవనం చేస్తున్నారు. ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో ఆమె కుమారుడు చంద్రకాంత్‌పై రంపంతో దాడి చేసి గాయపడినట్లు తెలిపారు ఈ కేసులో గణేశ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

బస్సు ఢీ కొని ఇద్దరి మృతి

పులివెందుల, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కడప నగరం సెంట్రల్ జైల్ సమీపంలోని శ్రీరాంనగర్ వద్ద ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సు ఢీ కొనడంతో ఇద్దరు యువకులు అక్కడిక్కడే మృతి చెందారు. బస్సు కడప నుంచి తిరుపతికి పోతుండగా ద్విచక్రవాహనంలో వెళుతున్న వీరిని ఢీకొట్టింది. మృతులు అక్కడికక్కడే చనిపోయారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఓటర్‌గానే కాకుండా లీడర్‌గా అవకాశం ఇవ్వండి



సమావేశంలో మాట్లాడుతున్న బాదుల్లా

కడప మారుతీనగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దాదాపు 79 సంవత్సరాలు అవుతున్నా ఇప్పటి వరకూ చట్ట సభల్లో ఒక్కరంటే ఒక్క దూదేకుల వర్గానికి చెందిన ఎమ్మెల్యే గానీ, ఎంపీ గానీ ఎమ్మెల్సీ గానీ లేకపోవడం బాధాకరమని ఆంధ్రప్రదేశ్ నూర్‌బాష్ ముస్లిం దూదేకుల పొలిటికల్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ సుంకేసుల బాదుల్లా అన్నారు. నాటి నుంచి నేటి వరకు అధికారం చలాయిస్తూ పాలన సాగిస్తున్న అన్ని పార్టీలు కూడా తమను ఓటు బ్యాంక్‌గానే చూస్తున్నాయని విచారం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024లో రాయలసీమ నడిబొడ్డున గల కడపలో దూదేకుల కార్పొరేషన్‌కు 100 కోట్లు కేటాయించి రుణాలు అందజేసి ఆ మేరకు మైనార్టీలుగా శాశ్వత జీవో ఇస్తామని చెప్పిన మంత్రి నారా లోకేష్ చేతులెత్తేశారన్నారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు.

ఏపీ ఎన్‌ఎండీపీ జేఏసీ జిల్లా అధ్యక్షుడిగా కుళాయప్ప..: ఆంధ్రప్రదేశ్ నూర్‌బాష్ ముస్లిం దూదేకుల పొలిటికల్ జేఏసీ జిల్లా అధ్యక్షుడుగా నాగూర్ కుళాయప్ప, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎస్. ఫక్రుద్దీన్, యువజన విభాగ అధ్యక్షుడుగా బాబా హుస్సేన్, ప్రధానకార్యదర్శిగా చింతకుంట బాబు, ఉపాధ్యక్షులుగా అబ్దుల్లా, మస్తాన్, సిద్ధయ్య, ఖాజాకుళాయప్ప, బి. దస్తగిరి, కార్యదర్శులుగా దుర్గం సుభాన్‌అలీబాష, ఆర్. దస్తగిరి, తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకుని నియామక ఉత్తర్వుల పత్రాలను అందజేశారు.

ఉన్నత విలువలకు కేంద్రాలు గ్రంథాలయాలు



మాట్లాడుతున్న లెక్కల కొండారెడ్డి

కడప కల్చరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి):విద్యతో పాటుగా ఉన్నత విలువలకు కేంద్రాలు గ్రంథాలయాలని కడప రెడ్డి సేవాసమితి ప్రతినిధులు కొనియాడారు. ఆ మేరకు కడప చిన్మయ మిషన్ అధ్యక్షుడు తురీయానందస్వామి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రాజీవ్‌పార్క్ రోడ్డులో గల కడపరెడ్డి సేవా సమితి వసతి గృహంలో విద్యార్థినీలకు యోగివేమన నైపుణ్యశిక్షణాభివృద్ధి కేంద్రం గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సమితి ప్రధానకార్యదర్శి లెక్కల కొండారెడ్డి, నగర ప్రముఖులు కుప్పిరెడ్డి నాగిరెడ్డి, ఎం. రామకృష్ణారెడ్డి, ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, ఎ. సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మండపాలకు మహాగణపతి



చెన్నూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఈ నెల27న జరిగే వినాయకచవితి పండుగకు గణపతి విగ్రహాలు ఊరూరుకు తరలిపోతున్నాయి. మండల పరిధిలోని ఇర్కాన్ సర్కిల్ వద్ద తయారు చేసిన విగ్రహాలను సోమవారం ఉదయం ప్రతిష్ఠించేందుకు ఆదివారం కొనుగోలు చేసి మినీ లారీలు, పెద్ద లారీల్లో అన్ని ప్రాంతాలకు తీసుకుపోతున్నారు. విగ్రహాలను మండపాలకు తీసుకొచ్చే ముందు బాణసంచా పేల్చుతూ తప్పట్లు మ్రోగిస్తూ పిల్లలు, యువత జైబోలో గణేశ్ మహారాజ్‌కి అంటూ తీసుకెళ్లడం జరుగుతోంది. అలాగే మండపాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు.









నేడు వైఎంఆర్ కాలనీలో విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రొద్దుటూరు , ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు సబ్‌డివిజన్ నార్త్ సెక్షన్ పరిధిలోని వైఎంఆర్‌కాలనీ ఫీడర్ కింద ఉన్న గాయత్రీనగర్ సాయినగర్, ప్రాంతాలలో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంటవరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు నార్త్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. రోడ్ క్రాసింగ్ వద్ద విద్యుత్ స్తంబాలు ఏర్పాటు చేయడం వలన విద్యుత్ సరఫరా నిలిపివేయవలసి వస్తున్నదని తెలిపారు. కావున ఆ ప్రాంత ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

ఉద్యోగులకు కరువు భత్యం ప్రకటించాలి


మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

పోరుమామిళ్ల ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు వెంటనే పీఆర్సీ, ఐఆర్ కరువు భత్యం ప్రకటించాలని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఏపీటీఎఫ్ రీజియన్ కార్యాలయంల జరిగిన సమవేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు, ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వ మెమో 57 ద్వారా పాత పెన్షను అమలు చేయాలని కోరారు. ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాలకు వాడరాదన్నారు.

నీటి సమస్యకు పరిష్కారం

మైదుకూరు రూరల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డు జోషఫ్‌పేట,శాంతినగర్‌లలో నీటి సమస్య ప్రజలు చెప్పిన 24 గంటల్లోనే పరిష్కరించారు. నియోజకవర్గంలో ప్రజలు ఎక్కడైన తాగునీటి సమస్య అని చెప్పిన 24 గంటల్లోని పరిష్కరించాలని ఎమ్మెల్యే పుట్టాసుధాకర్‌యాదవ్ ఆదేశాల మేరకు యూనిట్ ఇన్‌చార్జ్ తుపాకుల వెంకటరమణ దగ్గరుండి పనులు చేయించి మంచి నీటిని వదలడం జరిగింది.

సురవరం సుధాకర్‌రెడ్డి మృతికి ఘననివాళి

పోరుమామిళ్ల ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సీపీఐ జాతీయ మాజీ కార్యదర్శి సురవరం సుధాకరెడ్డికి సీపీఐ పోరుమామిళ్ల సమితి ఆదివారం ఘనంగా నివాళులర్పించింది. స్థానిక తిరుపతిరెడ్డికాలనీలో ఆయన చిత్రపటానికి సీపీఐ మండల కార్యదర్శి రవి కుమార్, సహాయ కార్యదర్శి కేశవ పూలమల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో షహిద, చెన్నయ్య పాల్గొన్నారు.

అడవులను తలపిస్తున్న పొలాలు

- గిట్టుబాటు కాక సాగుకు నోచుకోని మాగాణి భూములు
- వేల ఎకరాల నుంచి వందల్లోకి పడిపోయిన సాగు విస్తీర్ణం
- వరిపై ఆసక్తి చూపని రైతన్నలు


ఓబుళాపురం చెరువుకింద చిట్టడవిగా మారిన మాగాణి భూములు

కాశినాయన ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో సారవంతమైన మాగాణి భూములు చిట్టడవులను తలపిస్తున్నాయి. సంవత్సరాల తరబడి వందల ఎకరాల మాగాణి భూములు సాగుకు నోచుకోక ముళ్ళకంప పిచ్చిమొక్కలతో చిట్టడవులుగా మారుతున్నాన్నాయి. గతంలో చెరువులు కుంటల కింద ఉండే మాగాణి భూములతో పాటు వరికుంట్ల, నాయనపల్లె, ఇటుకులపాడు తదితర గ్రామాల్లో బోరుబావుల కింద కూడా ఖరీఫ్, రబీలో వరి విస్తారంగా సాగుచేసేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడంలేదు. దీనంతటికి కారణం వరి గిట్టుబాటు కాక పోవడమేనని రైతన్నలు పేర్కొంటున్నారు గత దశాబ్దకాలంగా మండలంలో వరి సాగు విస్తీర్ణం పరిశీలిస్తే 2013, 2014, 2015 సంవత్సరాలల్లో దాదాపు 4500 ఎకరాల నుంచి 5000 ఎకరాల వరకు సరాసరి సాగయ్యేది. అలాంటిది 2023 సంవత్సరం నాటికి వరి సాగు 1926 ఎకరాలకు పడిపోయింది. 2024 సంవత్సరంలో 1567 ఎకరాలుకు చేరింది. ప్రస్తుతం ఇప్పటివరకు కేవలం 170 ఎకరాలే వరిసాగు చేశారంటే పరిస్థితి ఎంతటి ఇబ్బందికరంగా మారిందో ఇట్టే అర్ధమవుతుంది. వరి సాగు ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయి. ప్రస్తుతం ఎకరాకు వరి నాటడానికి కూలీ ఖర్చు రూ.6వేలు, సేద్యానికి, ఎరువులకు, పిచికారి మందులకు, కోతమిషన్‌కు ఇలా అన్ని ఖర్చులు పరిగణలోకి తీసుకొంటే ఎంతలేదన్నా ఎకరాకు రూ.25వేల నుంచి రూ.30 వేల వరకు ఖర్చులు వస్తున్నాయి.

పంట దిగుబ డి బాగా పండింది అనుకుంటే ఎకరాకు సరాసరి 20 నుంచి 25 బస్తాలకంటే ఎక్కువ రావడం లేదంటున్నారు. ధరలు కూడా అంతంతమటుకే ఉన్నాయి. ఆరుగాలం కష్టించి సన్నాలు రకం పంట పండించినా ఆసమయంలో కల్లాల్లోనే బస్తా రూ.1300 నుంచి రూ.1400 మించి కొను గోలు చేయలేమంటారు.. ఆలెక్కన పంట పండిం చిన రైతులకు దినసరికూలీ కూడా లభించని పరిస్థితి ఏర్పడుతుంది. ఒక్కోసారి పంట చేతికొ చ్చే సమయంలో అకాలవర్షాలు చుట్టుముడితే పెట్టుబడి కూడా చేతికందదంటున్నారు రైతన్న లు. ఈ పరిస్థితుల నేపథ్యంలో బోరుబావుల కింద వరి సాగు చేసే రైతులు వరికి బై చెప్పి ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారిస్తున్నారు. మరోవైపు చెరువుల కింద వరి తప్ప ఏమీపండని మాగాణి భూములను సాగుచేసి నష్టపోవడం దేనికేటూ వదిలేస్తున్నారు. ఓబుళాపురం పెద్దచె రువుకింద దాదాపు 150 నుంచి 200 ఎకరాలు మాగాణి గత 5 సంవత్సరాలుగా సాగుకు నోచు కోక వందల ఎకరాల మాగాణి పొలం తుమ్మకం ప పిచ్చిమొక్కలతో చిట్టడవుల్లాగా దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వాలు మేల్కొని వరి సాగును ప్రోత్స హించేలా చర్యలు తీసుకోవాలని ధాన్యానికి గిట్టుబాటు ధర వచ్చేలా చూడాలని పలువురు రైతులు కోరుతున్నారు.

సెంచురీ పరిశ్రమ ప్యానెల్ పరిశీలన


సెంచురీ సిబ్బందిని ప్రశ్నిస్తున్న అధికారులు

గోపవరం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పీపీ కుంట దగ్గర ఉన్న సెంచురీ ప్లైవుడ్ కంపెనీని ఆదివారం విజిలెన్స్ అడిషనల్ ఎస్పీ.శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో యూరియా కొరత కారణంగా ఈ తనిఖీలు చేయడం జరుగుతుందని, ఇందులో భాగంగా గోపవరం మండలం పీపీకుంట దగ్గర ఉన్న సెంచురీ ఫ్యానెల్‌ను ఆకస్మికంగా తని ఖీ చేశారు. కాగా అక్కడ ఉన్న యూ రియా కేవలం ఇండస్ట్రియల్ పర్పస్ కోసం వాడుతున్నారని అధికా రులు నిర్ణయం తీసుకున్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ క్రిష్ణ య్య , మండల వ్యవసాయాధికారి విజయ్‌రావు, విజిలెన్స్ సీఐ శివ న్న తదితరులు పాల్గొన్నారు.

అనాథాశ్రమ వృద్ధులకు వస్తువులు వితరణ


వృద్దుడికి దుస్తులు వితరణ చేస్తున్న దృశ్యం

బద్వేలు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని కాశినాయన మండలం ఓబుళాపుంర గ్రామ పంచాయతీలో ఉన్న వివేకానంద సేవా ఆశ్రమాన్ని బద్వేలు ఆవోపా వారు సందర్శించి అక్కడి వృద్ధులకు వస్తువులు వితరణగా అందజేశారు. అనంతరం ఆశ్రమంలోని వృద్ధులక్షేమ సమాచారం తెలుసుకున్నారు. వారికి తమ వంతు సహకారం అందించాలనే ఉద్దేశ్యంతో ఆవోపా బృందం నూకల రెడ్డెయ్య, ప్రధాన కార్యదర్శి సీవీ నాగేశ్వరరావు, ఆర్థిక కార్యదర్శి సుబ్రమణ్యం, గౌరవ సభ్యుడు శ్రీరాములు ఆధ్వర్యంలో పంచెలు, బెడ్‌షీట్లు , మెడిసిన్, తదితర వస్తువులను వితరణగా అందించారు. ఈ సందర్భంగా రెడ్డెయ్య మాట్లాడుతూ మానవతా దృక్పధంతో ఆశ్రమాన్ని నడుపుతున్న నిర్వాహకులను అభినందనీయులన్నారు.

మట్టి గణపతిని ప్రతిష్ఠిద్దాం. పర్యావరణాన్ని కాపాడుదాం

బద్వేలు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ మట్టి గణపతిని పూజించి పర్యావరణపరిరక్షణకు పాటుపడాలని అర్బన్ సీఐ లింగప్ప అన్నారు. ఆదివారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో 'మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం' అనే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రజలందరూ పర్యావరణ భాగంగా మట్టి గణపతిని వాతావరణ కాలుష్యం నివారణకు పాటుపడాలని సూచించారు. డీవైఎఫ్ఐ కమిటీ వారు పలు సేవా కార్యక్రమాలను చేపట్టడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు చిన్ని, మస్తాన్‌షరీఫ్, ఆదిల్, పట్టణ నాయకులు సుధాకర్, ప్రసాద్‌రెడ్డి, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

శాంతియుతంగా ఉత్సవాలు నిర్వహించాలి

● ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు - డీఎస్పీ


కమిటీ సభ్యులకు సూచనలు ఇస్తున్న మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్

ఖాజీపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు శాంతియుతంగా వినాయక చవితి ఉత్సవాలను జరుపుకోవాలని మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం ఖాజీపేట పోలీసు స్టేషన్‌లో గ్రామాల్లోని కమిటీ సభ్యులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు వినాయక చవితి పండుగ సందర్భంగా ఏర్పాటు చేసే విగ్రహాల వద్ద శాంతియుతంగా పూజలు చేసుకోవాలన్నారు. ఇష్టానుసారంగా డీజేలు, డ్యాన్సులు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవన్నారు. నిమజ్జనం రోజు ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఒకే గ్రామంలో రెండు ప్రతిమలు ఏర్పాటుచేస్తే ఒకటి ఉదయం, మరొకటి సాయంత్రం నిమజ్జనం జరిగేలా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎక్కడైనా రికార్డింగ్ డ్యాన్స్‌లు ఏర్పాటు చేసుకున్నట్లు తెలిస్తే ప్రజలు సహకరించి సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ మోహన్, సిబ్బంది, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చవితి వేడుకలను ప్రశాంతంగా జరుపుకోండి


మాట్లాడుతున్న ఎస్ఐ చిన్నపెద్దయ్య

చాపాడు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ఈనెల 27న బుధవారం వినాయక చవితి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ చిన్నపెద్దయ్య పేర్కొన్నారు. పోలీసు స్టేషన్‌లో ఆదివారం సాయంత్రం వినాయక చవితి పండుగపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండపాల ఏర్పాటునకు ముందుగా పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. విద్యుత్, అగ్నిమాపక శాఖల నుంచి కూడా అనుమతులు పొందాలన్నారు. గ్రామంలోని అయిదు మందితో ఒక కమిటీని ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఏవైనా సంఘటనలు జరిగితే వారిదే బాధ్యత అన్నారు. ఏదైనా సమస్యలుంటే తన దృష్టికి తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చాపాడు, లక్ష్మీపేట, అల్లాడుపల్లె, రాజువారిపేట, ప్రజలు పాల్గొన్నారు.

మండపాలకు తరలిస్తున్న గణనాథులు


వినాయక విగ్రహాలను మండపాలకు తరలిస్తున్న నిర్వాహకులు

జమ్మలమడుగు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వేడు కలకు రెండు రోజులు ఉండడం తో జమ్మలమడుగులో ఆదివారం మధ్యాహ్నం నుంచి వినాయక విగ్రహాలను భారీగా మండపాలకు భక్తులు తరలిస్తున్నారు. అందులో భాగంగా జమ్మలమడుగు మున్సిపాలిటీ కార్యాలయం సమీపాన ప్రధాన రోడ్డు పక్కన తయారు చేసే ప్రాంతం నుంచి భక్తిశ్రద్ధలతో భాజాభజంత్రీలతో విగ్రహాలను తరలించారు. జమ్మలమడుగులో ఆర్టీసీ బస్టాండు సమీపాన బస్టాండు దగ్గరలో కార్మికులు, ఇతరులు వినాయక విగ్రహాలు అనుమతులు తీసుకుని కొలువు దీర్చేందుకు మండపాల వద్దకు ట్రాక్టర్లలో తరలించారు. అలాగే మండలంలోని గూడెం చెరువు, పొన్నతోట, నర్సోజీ కొట్టాల, అంబవరం, హనుమంతగిరి, మోరగుడి, ఎస్.ఉప్పలపాడు తదితర ప్రాంతాలకు గణేశ్ విగ్రహాలు కొలువుదీర్చేందుకు ఉత్సవ కమిటీల వారు తీసుకెళ్లారు.

ఉత్సవాలకు సిద్ధమైన వినాయక విగ్రహాలు



మైదుకూరు రూరల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి) : వినా యక చవితి ఉత్సవాలకు గణనాథులు సిద్ధమయ్యారు. ఇప్పటికే గణేశ్ మహారాజ్‌కీ జై అంటూ విగ్రహాలను ఆదివారం నుంచే నిర్వాహకులు వారి వారి గ్రామాలకు తీసుకెళుతున్నారు.వినాయక చవితి పండుగను పురస్కరించుకొని మైదుకూరు, ప్రొద్దుటూరు, కడప తదితర ప్రాంతాల నుంచి విగ్రహాలను తీసుకెళుతు న్నారు. విగ్రహాలకు తీసుకెళ్లేటప్పుడు కూడా బాణాసం చా పేల్చుకుంటూ సంతోషంగా మండపాలకు తరలిస్తున్నారు,

పూర్వ విద్యార్థుల అపూర్వకలయిక



ఎర్రగుంట్ల, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల మండలంలోని చిలమకూరు జడ్పీహైస్కూల్‌లో 1982-83 విద్యార్థులు అపూర్వ కలయిక ఆదివారం జరిగింది. పాఠశాలలో విద్యనభ్యసించిన చిర్రాజుపల్లెకు చెందిన శ్రీనివాసరెడ్డి డీఎస్పీ హోదాలో ఉన్నారు. అయన చాల దూరం నుంచి పాఠశాల పూర్వ విద్యార్థుల కలయికకు రావడం ఎంతో సంతోషంగా ఉందిని పలువురు బ్యాచ్‌మెట్లు హర్షం వ్యక్తం చేశారు. చిన్ననాటి ముచ్చట్లను గుర్తుకు తెచ్చుకుంటూ సంతోషంగా గడపారు. చదువుకున్న పాఠశాల అభివృద్ధి కోసం తమ సహకారం అందిస్తామని వారు పేర్కొన్నారు. ఎలాంటి కార్యక్రమాలు చేయాలన్నది త్వరలో నిర్ణయించి నిధులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, ఉమాదేవి (మాజీ కౌన్సిలర్), రాజా, ఏ.మధుసూధన్‌రావు, జి.జిలాన్, ఏ.పద్మలత, ఎం.నారాయణ, ఆర్గనైజర్ రాజశేఖర్‌రెడ్డి, రామక్రిష్ణలు,పవన్‌కుమార్‌రెడ్డి, దంతం సుబ్బరామయ్య పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి


సైకిల్ తొక్కుతున్న దృశ్యం

జమ్మలమడుగు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): శారీరక దృఢత్వం, ఆరోగ్య సంరక్షణకు సైకిల్ తొక్కడం ప్రతి ఒక్కరూ అలవాటుగా చేసుకోవాలని జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు ఫిట్‌నెట్ కోసం సైకిల్ తొక్కడం ఆయన ప్రారంభించారు. డీఎస్పీతోపాటు జమ్మలమడుగు అర్బన్ పోలీసు స్టేషన్, మైలవరం, తలమంచిపట్నం, పెద్దముడియం మండలాలకు చెందిన పోలీసు అధికారులు, సిబ్బంది సైకిల్ తొక్కారు. ప్రధాన రోడ్డుపై సైకిల్ ప్రతిరోజు తొక్కడం వలన ఆరోగ్యానికి ఉపయోగకరమన్నారు. రక్తప్రసరణ జరిగి కాళ్ల నొప్పులు ఉండవన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ సీఐ నరేష్‌బాబు, రూరల్ సీఐ భాస్కర్‌రెడ్డి, ఎస్ఐలు హైమావతి, శ్యాంసుందర్‌రెడ్డి, సుబ్బారావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సైకిల్ తొక్కండి..ఆరోగ్యంగా ఉండండి


ఎస్ఐలు, పోలీసు సిబ్బందితో కలిసి సైకిల్ తొక్కుతున్న సీఐ విశ్వనాథరెడ్డి.

ఎర్రగుంట్ల, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): సైకిల్ తొక్కడం వల్ల మంచి ఆరోగ్యం వస్తుందని, పోలీసులు అరగంటపాటు సైకిల్ తొక్కాలన్న ఎస్పీ ఆదేశాలతో ఎర్రగుంట్ల సీఐ విశ్వనాథరెడ్డి ఆదివారం సైకిల్ యాత్రను ప్రారంభించారు. స్థానిక పోలీసుస్టేషన్ నుంచి సైకిల్ యాత్రను ప్రారంభించి జడ్పీహైస్కూల్ మైదానం వరకు కొనసాగించారు. అక్కడ 400 ట్రాక్‌పై రౌండ్లు వేశారు. ఈ సైకిల్ యాత్రతో పోలీసులకు మంచి వ్యాయామం లభించింది. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు నాగమురళి, సునీల్‌కుమార్‌రెడ్డి, ఎర్రగుంట్ల, కలమల్ల పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై పోరాటం చేస్తాం


ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ ఎన్నికైన నూతన కమిటీ

జమ్మలమడుగు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ నాయకులు పేర్కొ న్నారు. ఆదివారం జమ్మలమడుగు ఆర్టీసీ డిపో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ కార్మికుల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీ శివారెడ్డి హాజరై మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి నూతన కమిటీని ఎన్నుకుంటున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆర్టీసీ డిపో అధ్యక్షుడు బ్రహ్మం అధ్యక్షతన నూతన కమిటీ ఎన్నుకున్నారు. నూతన కమిటీ కడప రీజినల్ కార్యదర్శిగా పి.సుధాకర్, జమ్మలమడుగు డిపో అధ్యక్షుడిగా బ్రహ్మం, డిపో ఉపాధ్యక్షుడిగా రవిబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కె.కాంతయ్య, డిపో కార్యదర్శిగా ఎంజీసీవో రెడ్డి, డిపో అడిషనల్ కార్యదర్శిగా నాగేంద్ర ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు ప్రకటించారు . ఈ సమావేశానికి రీజినల్ కమిటీ చైర్మన్ శేషన్న, రీజినల్ కమిటీ అధ్యక్షుడు నాగముని, కార్మికులు పాల్గొన్నారు.

సదరం వెరిఫికేషన్‌లో దివ్యాంగులకు తీవ్ర అన్యాయం


మాట్లాడుతున్న అప్జల్‌ఖాన్

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సదరం సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌లో దివ్యాంగులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆల్‌ఆఫ్‌యూ దివ్యాంగుల సేవా సంస్థ రాష్ట్ర కన్వీనర్ అప్జల్‌ఖాన్ పేర్కొన్నారు. ఆదివారం మున్సిపల్ పార్కులో దివ్యాంగుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పుట్టుకతో పోలియో వచ్చి కాళ్లు చచ్చుబడిపోయిన, మానసిక దివ్యాంగులకు, చెవిటి, మూగవారికి వెరిఫికేషన్ పేరుతో వికలత్వం శాతం తగ్గించడం దారుణమన్నారు. దశాబ్దకాలంగా పింఛన్ పొందుతున్న దివ్యాంగులు నేడు ప్రభుత్వ నిర్ణయం వలన పింఛన్‌కు దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. సదరం సర్టిఫికెట్ల పరిశీలనలో అనేక తప్పులు దొర్లాయని, వాటిని సవరించుకునే అవకాశం ఇవ్వాలని కోరారు. వెరిఫికేషన్‌లో శారీరక, మానసిక, ఆర్థోపెడిక్ వైకల్యం ఉన్నవారికి ప్రభుత్వం తప్పులను సరిదిద్దుకునే అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఖాజామొహిద్దీన్, ఓబులేసు, మహేష్‌కుమార్, నారాయణస్వామి, గురప్ప, అబ్దుల్‌రషీద్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరంలో 200 మందికి పరీక్షలు

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అమృతానగర్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో 200 మందికి వైద్య పరీక్షలు చేశారు. సీపీఎం, సీఐటీయూ, ఐద్వా ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించగా హోలిస్టిక్ ఆస్పత్రికి చెందిన వైద్య నిపుణులు రోగులను పరీక్షించారు. బీపీ, షుగర్, టుడి, ఏకో, ఈసీజీ, పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ అమృతానగర్‌లో పది వేల మంది జనాభా ఉన్నారని, వారంతా పేద ప్రజలేనని, వారి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఉచిత వైద్యశిబిరం నిర్వహించామన్నారు. దాదాపు 200 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బాబు, చెన్నారెడ్డి, సుబ్బారావు, ఐద్వా జిల్లా కార్యదర్శి ముంతాజ్‌బేగం, పట్టణ కార్యదర్శి సర్వేశ్వరి, అధ్యక్షురాలు వెంకటసుబ్బమ్మ, రాములమ్మ, లక్ష్మీదేవి, డీవైఎఫ్ఐ కార్యదర్శి విశ్వనాథ్, మున్సిపల్ యూనియన్ కార్యదర్శి సాల్మన్, చంటి పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు తప్పక పాటించాలి


ఆటో డ్రైవర్లకు సూచనలు ఇస్తున్న అర్బన్ సీఐ లింగప్ప

బద్వేలుటౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్క ఆటోడ్రైవర్ వాహన చట్ట నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని బద్వేలు అర్బన్ సీఐ లింగప్ప తెలిపారు. ఆదివారం సాయంత్రం అర్బన్ స్టేషన్ ఆవరణలో ఆటోడ్రైవర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రతి ఆటో డ్రైవర్‌కు డ్రస్ కోడ్ తప్పనిసరి అని, అలాగే పరిమితికి మించి ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు. అలాగే లైసెన్స్ ఇతర డ్రైవింగ్ పత్రాలు కలిగి ఉండాలని ప్రజల కు ఇబ్బంది కలిగించేలా ఆటోలలో పాటలు పెట్టి శబ్ద కాలుష్యం చేయరాదని సూచించారు. కొంతమంది యువత వారిష్టమొచ్చిన రీతిలో ఆటోలను నడుపుతూ పలు ప్రమాదాలకు గురవుతున్నారని అలాంటి వారికి శిక్ష తప్పదని హెచ్చరించారు.

ఫ్యాక్షన్ రాజకీయాలకు దూరంగా ఉండండి


సమావేశంలో మాట్లాడుతున్న రూరల్ సీఐ బాలమద్దిలేటి, ఎస్ఐ రాజు

ప్రొద్దుటూరు , ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధితో పాటు యువత భవిష్యత్తును తీర్చిదిద్దేలా వ్యవసాయంవైపు దృష్టి సారించాలే తప్ప ఫ్యాక్షన్ రాజకీయాలకు వెళ్లరాదని రూరల్ సీఐ బాలమద్దిలేటి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని పెద్దశెట్టిపల్లె పంచాయతీ శంకరాపురం గ్రామంలో రూరల్ సీఐ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఈసందర్భంగా రూరల్ సీఐ బాలమద్దిలేటి మాట్లాడుతూ అమాయక ప్రజలను సులభంగా మోసం చేసే సైబర్ నేరాలు పెరిగి పోయాయని వాటిపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజు తదితరులు పాల్గొన్నారు.